తేదీ 14.01.2003, బహుమతి ప్రదానోత్సవం, సాయికుల్వంత్ సభామండపం

# స్వామిని సంతృప్తిపరచాలంటే సద్గుణాలను పెంచుకోవాలి

**"దినకరుడు శాంతుడై తోచె, దినములింక కురుచనయ్యె, చలిగాలి చురుకు హెచ్చె, పొలములన్ రేని గ్రుడ్డి వెన్నెలలోన కుప్పలన్ నూర్చు కాపులు గొంతులెత్తి పదములన్ పాడదొడగిరి, పచ్చపూవుల జనపచేలకు ముత్యాలసరులు గూర్చి, మిరపపండ్లకు కుంకుమ మెరుపు రాల్చి, బంతిపూల మొగములల్లంత విప్పి మన గృహముల ధాన్యసంపదల నింపి, సరసురాలైన సంక్రాంతి పండుగొచ్చె సరసురాలైన పుష్యమాసంబు వచ్చె"**

*ప్రేమస్వరూపులారా! విద్యార్థినీ విద్యార్థులారా!* ఈనాటి పర్వదినము సామాన్యమైనది కాదు. దీనిని ఉత్తరాయణ పర్వదినమని కూడా పిలుస్తూ వచ్చారు. సర్వోత్తమమైన గుణములనందించి, సర్వ సంపదలను చేకూర్చి, సత్కర్మలకు దోహదం చేసి ఆనందమునందించే దినమే ఈ మహా పర్వదినము. ఇంతేగాక, ఈనాడు పవిత్రమైన ముక్కోటి ఏకాదశి; దేవతలు, దానవులు కలసి క్షీరసాగరమును మథించగా వారికి అమృతము లభించిన పవిత్ర దినము.

ఈనాటి మానవుడు తన హృదయాన్ని లౌకిక భావాలతో నింపుకోవడంచేత తనయందే ఉన్న దివ్యత్వమును ఆవిర్భవింపజేసుకొనలేకపోతున్నాడు. కంసుడు, హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు, దుర్యోధన, దుశ్శాసనాదులు సామాన్యులు కారు; శారీరకంగాను, మానసికంగాను అమితమైన శక్తి గలవారు. కాని, ప్రాకృతమైన భావములను పెంచుకోవడంవలన వాళ్ళు బలహీనులైపోయారు. హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు గొప్ప

srisathyasai vahini vacharamrutam

సైంటిస్టులు, గొప్ప శక్తిసామర్థ్యములు గలవారు. హిరణ్య కశిపుడు చంద్రమండలమునేగాక సూర్యుణ్ణికూడా చేరుకోగల్గాడు. అంతటి శక్తిసామర్థ్యములు కల్గినవాడైనప్పటికీ తన హృదయంలో ప్రాకృతమైన భావాలను నింపుకోవడంచేత అన్నివిధాలుగా బలహీనుడైపోయాడు. ప్రతి మానవుడు గొప్ప శక్తిమంతుడే, గొప్ప మేధావియే. కాని, ప్రాకృతమైన భావాలను హృదయంలో నింపుకోకూడదు. మానవుడు తన సంకల్పాలను ఉత్తమమైనవిగా మార్చుకున్నప్పుడు యావత్ప్రపంచమునే హస్తగతం చేసుకోగలడు.

**మనస్సును మీ బానిసగా చేసుకోండి**

ఈనాటి యువతీ యువకులే భవిష్యత్తులో యావత్ప్రపంచమును పరిపాలించే నాయకులు. దేశసౌభాగ్యం యువతీ యువకుల ప్రవర్తనపైనే ఆధారపడి యున్నది. కనుక, యువతీ యువకులు మొట్టమొదట తమ హృదయంలో సద్భావాలను, సచ్చింతనలను నింపుకోవాలి. అలాంటి వ్యక్తులు ఎట్టి ఘన కార్యమునైనా సాధించగలరు. ఈనాటి మానవుడు అన్నింటినీ సాధిస్తున్నాడుకాని, దేనిని సాధిస్తే సర్వమును సాధించినవాడౌతాడో దాని కొరకు ఏమాత్రం ప్రయత్నం చేయడంలేదు. మానవునియందున్న మహత్తరమైన శక్తి మరి యే జీవియందూ కానరాదు. అదియే మనస్సు. మనస్సును స్వాధీనం చేసుకున్న వ్యక్తి దేనినైనా సాధించగలడు. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః" బంధనకుగాని, మోక్షమునకుగాని మనస్సే మూలకారణం. కాని, మానవుడు తన మనస్సును స్వాధీనం చేసుకోలేకపోతున్నాడు. కనుకనే, అందుకోవలసిన ఆనందానికి అత్యంత దూరమైపోతున్నాడు. తన మనస్సును స్వాధీనపరచుకున్న వ్యక్తి సర్వోత్కృష్టమైన ఆనందాన్ని అనుభవించగలడు. కనుక, మీరు మొట్టమొదట మనస్సును అదుపులో పెట్టుకోవాలి.

విద్యార్థులారా! మీ ఆటలు, పాటలు అందరికీ ఎంతో ఆనందమును, ఆహ్లాదమును, ఉత్సాహమును అందించాయి. అయితే, ఈ ఆటపాటలు కేవలం లౌకిక, భౌతిక, ప్రాకృత అంశాలుగా మీరు భావించకూడదు. ఇవి నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక తత్త్వములతో కూడినవిగా విశ్వసించాలి. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక శక్తులను సాధించిన

sri sathyasai vacharamrutam

వ్యక్తియే నిజమైన మానవుడు. కేవలం శారీరకమైన పుష్టికోసం, తుష్టికోసం మీరు ప్రాకులాడకూడదు. మనస్సును స్వాధీనమునందు ఉంచుకోవడానికి తగిన కృషి చేయాలి. మనస్సుకు మీరు బానిసలు కాకూడదు. మనస్సునే మీ బానిసగా చేసుకోవాలి. ఎంతటి శక్తిసామర్థ్యములు గలవాడైనా మనస్సుకు బానిస అయినప్పుడు తాను బలహీనుడైపోతాడు. మనస్సునందున్న శక్తిసామర్థ్యములు ప్రపంచములో దేనియందూ కానరావు. మనస్సునుండియే మహా విలువైన గుణములు ఆవిర్భవిస్తాయి. ధనమును కోల్పోతే ఏదోవిధంగా శ్రమపడి దానిని తిరిగి సంపాదించుకోవచ్చు. ఆరోగ్యము క్షీణిస్తే మంచి వైద్యుణ్ణి ఆశ్రయించి తిరిగి ఆరోగ్యమును పొందవచ్చును. కాని, మానవతాగుణములను కోల్పోతే సర్వమును కోల్పోయినవారమౌతాము. మానవతాగుణములు గ్రంథములనుండిగాని, లేక గురువులనుండిగాని లభించేవి కావు. నిత్య జీవితంలో సద్భావములను అభివృద్ధిపరచుకొని సత్కర్మలనాచరిస్తూ ఉన్నప్పుడు మానవతా విలువలు మన వెంటనే, ఇంటనే, జంటనే ఉండి మనలను కాపాడుతాయి.

**బహు'మతులు' వద్దు, నిజమతిని అందుకోవాలి**

ప్రేమస్వరూపులారా! మీరెన్నో విద్యలు నేర్చుకుంటున్నారు, ఎన్నో శక్తులను సంపాదిస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా మానవతావిలువలను పోషించుకోవాలి. సర్వశక్తులూ వాటియందే అంతర్భూతమై ఉన్నాయి. సత్యమే మన ప్రత్యక్ష దైవం. ధర్మమే మన జీవితానికి పునాది. దీనిని పురస్కరించుకొనియే భారతీయసంస్కృతి, "సత్యాన్నాస్తి పరో ధర్మః" అని చెప్పింది. కనుక, సత్య ధర్మములను కాపాడే నిమిత్తమై మీ జీవితాన్ని ధారపోయాలి. ప్రాకృతమైన బహుమతులకోసం మీరు ప్రాకులాడకూడదు. ఇవి నిజమైన బహుమతులు కావు. ఒక్క మతివల్లనే మీరెన్నో ఇక్కట్లకు గురి అవుతున్నారు. ఇంక, బహు'మతులు'ంటే మీరు కోతికంటే హీనులౌతారు. మీరు అందుకోవలసింది బహు'మతి' కాదు, నిజమతిని అందుకోవాలి. నిజమతి అంటే హృదయమునుండి ఆవిర్భవించే పవిత్రమైన సూక్తి. సర్వశక్తులూ మనోభావమునుండియే ఆవిర్భవిస్తున్నాయి.

srisathyasaivachanamrutam

**హృదయంలో దైవభావమును నింపుకోవాలి**

మానవజన్మ దుర్లభమైనది. మానవుడు సామాన్యుడు కాడు, ఎంతో గొప్ప శక్తి కల్గిన ధీరుడు, వీరుడు, గంభీరుడు. హృదయంలో దైవభావమును నింపుకున్నప్పుడు తాను ఎంతటి ఘనకార్యమునైనా సాధించగలడు. శాంతుడు, గుణవంతుడు, బలవంతుడని పేరుగాంచిన హనుమంతుడు నిరంతరం రామనామస్మరణచేస్తూ వచ్చాడు. రామనామ దివ్యమహిమచేతనే, ఆ భక్తిచేతనే, ఆ ప్రేమచేతనే అతడు అంత పెద్ద సముద్రాన్ని దాటగల్గాడు. భారతీయ సంస్కృతి నవవిధములైన భక్తిమార్గములను ప్రబోధిస్తోంది.

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం**
**వందనం అర్చనం దాస్యం స్నేహమాత్మనివేదనం**

స్నేహమనేది జరిగిన తరువాతనే ఆత్మనివేదనం సాధ్యమౌతుంది. భగవంతునితో స్నేహము చేయకుండా ఉండినంతవరకు ఆత్మార్పణమనేది మాటలతో తప్ప క్రియారూపంలో ఆచరించలేము. క్రియారూపముకంటే భావరూపమే చాలా బలవత్తరమైనది. కనుక, హృదయంలో ఉత్తమ భావములను పోషించుకోవాలి. విద్యార్థులారా! ఇక్కడగాని, మరెక్కడగాని 'సర్వం విష్ణుమయం జగత్', 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే దివ్యమైన భావముతో మీరు జీవితాన్ని గడపాలి. దైవత్వ మనేది ప్రత్యేకంగా ఎక్కడో లేదు. మీ ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉంటుంది. మిమ్మల్ని కంటికి రెప్పవలె కాపాడుతూ ఉన్నది. అట్టి దివ్యమైన, భవ్యమైన శక్తిని మీరెందుకు విస్మరిస్తున్నారు? మీరు పరీక్షలలో మంచిమార్కులు సాధించినంతమాత్రాన సరిపోదు. చెడ్డ రిమార్కులు రాకుండా చూసుకోవాలి. మానవదేహం ధరించినందుకు మీరు మానవతావిలువలను పోషించుకోవాలి. కాని, మీరు మానవతావిలువలను కోల్పోతున్నారు. అందువలన పూర్తిగా బలహీనులైపోతున్నారు. ఈనాడు ఎందరో యువకులు చదువు నిమిత్తమై, ధనము నిమిత్తమై దేశదేశాలు తిరుగుతూ అనేక పాట్లుపడుతున్నారు. నిజమైన భోగభాగ్యములు మన హృదయమునందే ఉన్నాయిగాని, బయట లేవు. కనుక, మనస్సును అంతర్ముఖం గావించుకొని మానవతావిలువలను సాధించాలి. నిజమైన విలువల నిమిత్తం మీరు హృదయాంతరాళములోనికి ప్రవేశించాలి.

srisathyasaivachanamrutam

## ప్రైజులకోసం కాదు, స్వామితృప్తికోసం

విద్యార్థులారా! ఈ సాంస్కృతిక క్రీడోత్సవాన్ని విజయవంతం చేయాలని మీరు గడచిన వారం రోజులనుండి అన్నపానాదులను, నిద్రాహారములను విడిచిపెట్టి ఎంత శ్రమపడుతున్నారో, ఎన్ని విధములుగా తర్ఫీదు పొందుతున్నారో నేను చూస్తూనే ఉన్నాను. బయటి విద్యార్థులు చేసే పనులకు, మన విద్యార్థులు చేసే పనులకు ఎంతో వ్యత్యాసమున్నది. బయటి విద్యార్థులు ఏవో ప్రైజులు తేవాలని, మెడల్స్ తేవాలని... పేరుప్రతిష్ఠలకోసం ప్రాకులాడుతుంటారు. కాని, మన విద్యార్థులు కేవలం స్వామితృప్తికోసం పాటుపడుతున్నారు. స్వామికి సంతృప్తి కల్గించాలంటే మొట్టమొదట హృదయంలో సద్గుణాలను నింపుకోవాలి. నేడొకవిధంగా, రేపు మరొకవిధంగా మార్చుకోకూడదు. చలించని మనస్సును, భ్రమించని దృష్టిని పోషించుకోవాలి. భగవంతుడు సర్వత్రా వ్యాపించియున్నాడనే నమ్మకాన్ని పెంచుకోవాలి. అప్పుడే మీరు అన్నింటినీ సాధించినవారౌతారు. *నమ్మకమెక్కడో ప్రేమ అక్కడ, ప్రేమ ఎక్కడో సత్యమక్కడ, సత్యమెక్కడో శాంతి అక్కడ, శాంతి ఎక్కడో ఆనందమక్కడ, ఆనందమెక్కడో దైవమక్కడ.* విశ్వాసమనే విత్తనమునుండియే ఆనందమనే ఫలము లభిస్తుంది. ఒక విత్తనమును భూమిలో నాటినప్పుడు అది క్రమక్రమేణ ఒక మహావృక్షముగా తయారై ఫలపుష్పాదుల నందిస్తుంది. అదేవిధంగా, మీ హృదయక్షేత్రమునందు సత్సంకల్పమనే బీజమును నాటుకున్నప్పుడు అదొక గొప్ప ఆధ్యాత్మికశక్తిగా రూపొంది శాంతి, ఆనందములనే ఫలపుష్పాదుల నందిస్తుంది. మీరు శాంతి కావాలని కోరుకుంటున్నారు. అయితే, బాహ్యజగత్తులో శాంతి కానరాదు. మన విశ్వాసము నుండియే మనకు శాంతి లభిస్తుంది. ఈనాటి మానవునికి విశ్వాసము దృఢంగా ఉండడం లేదు. ఎదురుగా వచ్చినప్పుడు విశ్వాసం ఉన్నట్లు నటిస్తుంటారు. ఈనాడు అందరూ భక్తులుగా నటిస్తున్నారేగాని, నిజమైన భక్తులుగా మారటం లేదు. మీరు స్థిరచిత్తులుగా రూపొందాలి. అప్పుడు మీలో విశ్వాసముకూడా స్థిరంగా ఉంటుంది.

sri sathyasai vachanamrutam

**ప్రేమను మించిన శక్తి లేదు**

విద్యార్థులారా! మీరు శాశ్వతానందమును అనుభవించాలంటే స్థిరమైన విశ్వాసమును కలిగి ఉండాలి. కాని, ఈనాటి వ్యక్తులకు విశ్వాసము అంటే ఏమిటో అర్థంకావడం లేదు. 'మేము భగవంతుణ్ణి విశ్వసిస్తున్నాము, ప్రేమిస్తున్నాము', అని చెబుతున్నారేగాని, విశ్వాసమంటే ఏమిటో, ప్రేమంటే ఏమిటో వారికి బోధపడడం లేదు. నిజమైన ప్రేమ హృదయమునుండి ఆవిర్భవిస్తుంది. అది ధర్మముతోకూడినది. ప్రేమకు పర్యాయపదము ధర్మమే. మన జీవిత ప్రధాన లక్ష్యము ప్రేమ ఒక్కటే. ప్రేమయే మన Way of life. ప్రేమను పెంచుకున్నప్పుడు మనం ఎంతటి శక్తిసామర్థ్యములనైనా పొందగలము; హిరణ్యాక్ష, హిరణ్యకశిపులవంటి శక్తిమంతులను కూడా మనం జయించగలము. లౌకికమైన శక్తులన్నీ అల్పమైనవి. ప్రేమను మించిన శక్తి లేదు. భారతీయ సంస్కృతి ప్రేమతత్త్వమునుగురించి ఎంతగానో బోధించింది. ప్రేమయే అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తింపజేస్తుంది. అనేకమంది కవిత్వం వ్రాస్తుంటారు, లక్షలకొలదీ పద్యాలు వ్రాస్తుంటారు. పద్యానికి ప్రేమతత్త్వమే ప్రాణసమానమైనది. మా రాజు *(ఎ.వి.ఎస్. రాజు)* కూడా కవిత్వం వ్రాస్తుంటాడు. ఎక్కడ కూర్చున్నా వ్రాస్తూనే ఉంటాడు. ఇప్పటికి కొన్ని లక్షలు వ్రాశాడు. అయితే, ఈ లక్షలందున్న లక్ష్యము ఒక్కటే... అదే ప్రేమ.

**అంపశయ్యపై భీష్మపితామహుడు**

ఈనాడు ముక్కోటి ఏకాదశి. దీనినే వైకుంఠ ఏకాదశి అని కూడా అంటారు. ద్వాపరయుగంలో భీష్మాచార్యుడు 56 దినములు అంపశయ్యపై పరుండి ఈ ఉత్తరాయణ పుణ్యకాలముకోసం నిరీక్షించాడు. అతని దేహమంతా అంబులతో నిండిపోయింది. దేహము మాత్రము శరతల్పముపై నిలిచిందిగాని, తల మాత్రం ఎట్టి ఆధారమూ లేక వ్రాలిపోయింది. అంత్యములో పంచపాండవులు ద్రౌపదిని వెంటపెట్టుకొని భీష్ముణ్ణి చూడడానికి వెళ్ళారు. ఆయనను ఆ స్థితిలో చూసి చాలా బాధపడ్డారు. అప్పుడు భీష్ముడు తన పరిస్థితికి తానేమీ విచారించడం లేదని, తన కర్తవ్యాన్ని తాను నిర్వర్తించానని అన్నాడు. ప్రతి వ్యక్తి తన దేహమును దేశక్షేమమునకు, సత్యవ్రతమునకు, ధర్మస్థాపనకు అర్పితం గావించాలని

srisathyasaivachanamrutam

బోధించాడు.

"అర్జునా! నీవు వేసిన బాణములు నా దేహానికి మాత్రమే తగిలినవి గాని, నా శిరస్సుకు చేరలేదు. నీవు నా దేహముకొరకు శరతల్పమును ఏర్పాటు చేశావు. కాని, 'దిండు' లేకపోవడంవల్ల నా శిరస్సు వ్రాలిపోయింది. ఇంత చేసినవాడవు ఒక 'దిండు'కూడా అందిస్తే బాగుంటుంది" అన్నాడు. ఆయన కోరికమేరకు అర్జునుడు రెండు అంబులను చెరొకవైపు వేసి వాటిమధ్యలో భీష్ముని తలను పెట్టాడు. భీష్ముడు ఎంతో సంతోషించి, "అర్జునా! నేను గంగాదేవి పుత్రుడను. కనుకనే, నన్ను గాంగేయుడన్నారు. నేను నా తల్లికి ఏనాడో దూరమయ్యాను. ఈ అంత్యసమయంలో నా తల్లిని నాకందించు. నా తల్లిలో నేను చేరిపోవడానికి సహకరించు", అని కోరాడు.

అర్జునుడు మహావీరుడు, గొప్ప శక్తిసంపన్నుడు. "అర్జున, ఫల్గున, పార్థ, కిరీటి, శ్వేతవాహన, బీభత్స, విజయ, కృష్ణ, సవ్యసాచి, ధనుంజయ..." మొదలైన అనేక బిరుదులను పొందినవాడు. ఒక్క అంబుతో భూమినుండి గంగను రప్పించాడు. ఒక ఫౌంటెన్ మాదిరి గంగ పైకెగసివచ్చి భీష్ముని నోట్లో పడింది. అప్పుడు భీష్ముడు, "అర్జునా! ఈ లోకంలో ఎలాంటి సహాయమైనా చేసేవారున్నారు. కాని, అంత్యకాలంలో తల్లిని అందించేవారు కానరారు. ఈనాడు నీవు నా తల్లిని అందించి నాకెంతో ఆనందాన్ని కల్గించావు" అన్నాడు. "మీరు విజయం సాధింతురుగాక!" అంటూ పాండవులను ఆశీర్వదించాడు. పెద్దల ఆశీర్వాదం పొందవలెనంటే వారి మనస్సును సంతృప్తిపరచాలి.

**మనస్సును 'పాజిటివ్'గా ఉంచుకోవాలి**

విద్యార్థులారా! మీరు స్వామితృప్తి నిమిత్తమై ఆటపాటలలో పాల్గొన్నారు. స్వామితోపాటు మీరుకూడా తృప్తిపడాలి. కేవలం ఆటలలో మాత్రమే కాదు, అన్నింటియందు తృప్తి కావాలి. మీరు జీవితమంతా ఆనందంగా గడపాలి. మీరు దేహముతో అనేక పనులు చేస్తున్నారు. అది మాత్రమే ప్రధానం కాదు. మీ మనస్సును పవిత్రంగా ఉంచుకోవాలి. ఈనాడు ఎక్కడ చూసినా మాలిన్యమే! తినే తిండి, త్రాగే నీరు, పీల్చే గాలి... అన్నింటియందు మాలిన్యమే! అయితే, మీ మనస్సులో దుర్భావాలనే మాలిన్యం చేరకుండా చూసుకోండి. మనస్సు

sri sathyasai vahanamrutam

నిరంతరం 'పాజిటివ్'గా ఉండాలేగాని,'నెగెటివ్'గా ఉండకూడదు. 'నెగెటివ్ మైండు'తో ఏ చిన్న పని చేపట్టినప్పటికీ అందులో విజయం సాధించలేము. 'పాజిటివ్ మైండు' కావాలి. ఎప్పుడూ ఆనందాన్ని అనుభవించే మనస్సును అభివృద్ధిపరచుకోవాలి. ఆ ఆనందాన్ని అందరికీ పంచాలి. అదే నిజమైన మానవత్వము. 'మానవుడు' అనగా అర్థమేమిటి? 'మా' అనగా అజ్ఞానం, 'న' అనగా లేకుండా, 'వ' అనగా వర్తించడం. అజ్ఞానము, అశాంతి లేకుండా, అన్యాయఅక్రమాలకు పాల్పడకుండా వర్తించేవాడు మానవుడు. విద్యార్థులారా! మీరెన్నో చదువులు చదువుతున్నారు, గొప్పగొప్ప బిరుదులు పొందుతున్నారు. అన్నింటికంటే గొప్ప బిరుదు ఏమిటి? "శృణ్వంతు విశ్వే అమృతస్యపుత్రాః", "నాయనా! నీవు అమృతపుత్రుడవు", అని వేదము చెబుతోంది. అట్టి పవిత్రమైన బిరుదును మీరు నిలబెట్టుకోకుండా అల్పమైన బిరుదులకోసం ప్రాకులాడుతున్నారు.

ప్రేమస్వరూపులారా! మీ హృదయాలను ప్రేమతో నింపుకోండి. మీ మనస్సును సత్యముతో పోషించుకోండి. దివ్యమైన కర్మలనాచరించండి. లౌకికమైన చదువులుకూడా అవసరమే. కాని, అనేకత్వంలో ఉన్న ఏకత్వాన్ని గుర్తించడమే నిజమైన విద్య. ఏకత్వాన్ని అనేకత్వంగా విభజించరాదు. అనేకత్వాన్ని ఏకత్వంగా భావించుకోవాలి. అదియే నిజమైన Culture(సంస్కృతి). Cultureఅంటే ఏమిటనుకున్నారు? అది ఒక కులానికిగాని, ఒక మతానికిగాని సంబంధించినది కాదు; హృదయానికి మాత్రమే సంబంధించినది, దైవత్వంతోకూడినది. ఏకాత్మప్రేమయే నిజమైన ప్రేమ. అది ఎప్పటికీ మారని ప్రేమ. స్వామిని మీరంతా ప్రేమిస్తున్నారు. ఆ ప్రేమ కదలిపోయే ప్రేమ కాదు. "స్వామి నావాడు, నేను స్వామివాడను", అని భావించండి. అట్టి ఏకత్వాన్ని మీరు సాధించండి. అదియే సత్యమైన మార్గము. సత్యమైన, నిత్యమైన జీవితాన్ని మీరు గడపాలి. అందరికీ ఆదర్శమునందించాలి. అదియే నిజమైన విద్యావంతుల లక్షణం. మస్తకాన్ని పుస్తకంగా మార్చుకోవడం గొప్పతనం కాదు. ఎలాంటి సమయమునందైనా దైవాన్ని మాత్రం మరువకండి, విడువకండి. దైవాన్ని మరచితే మీరు దయ్యాలైపోతారు. మీరు అమృతపుత్రులు. ఆ పేరును సార్థకం గావించుకోండి. మీ శక్తిసామర్థ్యములను వ్యర్థం చేయకండి. అంతా దైవార్పితం గావించండి. శరీరంలోని సర్వశక్తులూ భగవంతుని

sri sathyasaivachanamrutam

వరప్రసాదములే! ప్రతి అణువునందు, ప్రతి కణమునందు దైవశక్తియే నిండియున్నది. కనుక, ఏది వ్యర్థం చేసినా మీరు దైవానికే ద్రోహం చేసినవారవుతారు. మీ దేహమనోబుద్ధులను దైవార్పితం గావించాలి. మీరు తలచే తలపులందు, పలికే పలుకులందు, చేసే పనులయందు ఏకత్వం ఉండాలి. 'సత్యం వద, ధర్మం చర' అని బోధిస్తోంది భారతీయసంస్కృతి. ఈ రెండింటినీ మీరు మరువకుండా ఆచరణలో పెట్టాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 14.01.2003, బహుమతి ప్రదానోత్సవం, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam